ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌కు విద్యార్థి ఎంపిక

కామారెడ్డి, జనవరి 4 : ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌కు కామారెడ్డిలోని ఆర్కే ఎన్‌సీసీ విద్యార్థి శ్రీకాంత్ ఎంపికైనట్లు కళాశాల సీఈవో డాక్టర్ జైపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీకి చేరుకున్న శ్రీకాంత్ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లో రిపోర్టు చేశారు. ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌లో ఇతర కెడెట్లతో కలిపి పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌లు సైదయ్య, దత్తాత్రి, నవీన్ కుమార్, గోవర్ధన్‌రెడ్డి, గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

విద్యార్థినులకు డిక్షనరీల అందజేత

బీబీపేట్, జనవరి 4 : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 7, 8, 9వ తరగతి చదువుతున్న 60 మంది విద్యార్థినులకు కాగ్నిజెంట్ కంపెనీలో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రూ.25వేల విలువ చేసే ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 10వ తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థినులకు రూ.50 వేల స్కాలర్‌షిప్ ఇస్తామన్నారు. డిగ్రీ అనంతరం తమ కంపెనీలో ఉద్యోగం కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాగ్నిజెంట్ కంపెనీ సీనియర్ మేనేజర్ బాలప్రసాద్, కంపెనీ టీం సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు రామేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మాచారెడ్డి, జనవరి 4 : మండల కేంద్రంలో ఉన్న బీసీ వసతి గృహంలోని విద్యార్థులకు శనివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. మాచారెడ్డి పీహెచ్‌సీ వైద్యుడు ఆదర్శ్ ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. విద్యార్థుల ఆరోగ్య శ్రేయస్సు కోసం వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వసతిగృహ వార్డెన్ చక్రధర్, వెంకటేశ్వర్‌రావు, ఏఎన్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులకు అడ్డాగా.. కామారెడ్డి పెద్ద చెరువు

- అధ్వానంగా మారిన మినీ ట్యాంకు బండ్
- దట్టంగా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు
- స్థానికులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న మందుబాబులు
- చోద్యం చూస్తున్న అధికారులు

కామారెడ్డి పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్‌పై ఏపుగా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు

మందుబాబులు తాగి పడేసిన మద్యం సీసాలు

కామారెడ్డి, జనవరి 4 : జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువు మినీ ట్యాంక్ బండ్ మందుబాబులకు అడ్డాగా మారింది. మినీ ట్యాంకు బండ్‌పైన దట్టంగా ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరిగాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్‌గా మార్చారు. ప్రజలకు ఆహ్లాదంగా ఉండడానికి కట్టను చదును చేసి చుట్టూ స్టీల్ రాడ్లను బిగించారు. వాకింగ్ చేయడానికి అనువుగా ట్రాక్‌ను నిర్మించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ మినీట్యాంక్‌బండ్‌ను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కట్ట చుట్టూ ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగినా అధికారులు కనీసం అక్కడికి వెళ్లి చూసిన పాపాన పోలేదు. సాయంత్రం అయ్యిందంటే మందు బాబులు ఇక్కడ దర్జాగా మద్యం తాగుతున్నారు. పట్టణానికి దూరంగా ఉండడంతో ఉదయం నుంచే మందుబాబులు మందు తాగుతూ.. చిందేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు కామారెడ్డి చెరువు కట్ట అడ్డాగా మారింది. సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఈ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. తాగిన మందు సీసాలను పగులగొట్టి అక్కడే పడేయడంతో పొలాలకు వెళ్లే వారికి గుచ్చుకొని ప్రమాదాలకు గురవుతున్నారని వాపోతున్నారు. మహిళలు ఉదయం పూట తిరగాలంటేనే జంకుతున్నారు. ఉదయం నుంచి మద్యం తాగుతుండడంతో ఎవరైనా అక్కడికి వెళ్తే తాగిన మైకంలో బూతులు తిడుతున్నారని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మినీట్యాంక్ బండ్‌పై పెరిగిన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించి, మందు బాబులు అక్కడికి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ స్పందనను వివరణ కోరగా శానిటేషన్ డిపార్ట్‌మెంట్ వారితో మాట్లాడి అక్కడున్న పిచ్చి మొక్కలను తొలగిస్తామని చెప్పారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

కామారెడ్డి, జనవరి 4 : కామారెడ్డి జిల్లా పిట్లంకు చెందిన వంశీ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగ వెంకటేశ్వర్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో జనగామలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీన ఉత్తరాఖండ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు.

గుడిసె దగ్ధం

మాచారెడ్డి, జనవరి 4 : పాల్వంచ మండలంలోని మంథనిదేవునిపల్లి గ్రామంలో కామటి రాజవ్వ గుడిసె శనివారం వేకువజామున దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజవ్వ దూడను గుడిసెలో రాత్రి కట్టేసి అదే గ్రామంలో నివసిస్తున్న తన కూతురు ఇంట్లో పడుకోవడానికి వెళ్లింది. వేకువజామున నివాసపు గుడిసెతో పాటు దూడ కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఆర్ఐ రమేశ్ పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రాజవ్వ వేడుకుంటున్నది.

రోడ్డు భద్రతా మాసోత్సవాలు

మాచారెడ్డి, జనవరి 4 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాలపై అవగాహన శనివారం కల్పించారు. ఈ సందర్భంగా మోటర్ వాహన తనిఖీ అధికారి నాగలక్ష్మి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రోడ్డుపై వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. నిబంధనలు తెలుసుకొని వాహనాలపై ప్రయాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠధామానికి దారి చూపండి

- చివరి మజిలీకి తీరని కష్టాలు
- శ్మశాన వాటికపై శ్రద్ధ చూపని అధికారులు

మాందాపూర్‌లోని వైకుంఠధామానికి వెళ్లేందుకు దారిని పరిశీలిస్తున్న ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్ (ఫైల్)

బీబీపేట్, జనవరి 4 : మండలంలోని మాందాపూర్‌లో ఉన్న వైకుంఠధామానికి వెళ్లేందుకు దారి చూపాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. చివరి మజిలీకి ఎలాంటి చింత లేకుండా ఉండేందుకు వైకుంఠధామాన్ని నిర్మించారు. కానీ.. రోడ్డు వేయడం మాత్రం మరిచారు. ఈ విషయాన్ని గతంలో నమస్తే తెలంగాణ దినపత్రిక ప్రచురించింది. ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్ తూతూ మంత్రంగా శ్మశాన వాటిక దారి కోసం పరిశీలించి గ్రామ సభ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని చేతులు దులుపుకొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వైకుంఠధామానికి వెళ్లేందుకు దారి చూపించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జడ్పీహెచ్ఎస్‌లో గణిత మేళా

నస్రుల్లాబాద్, జనవరి 4 : బీర్కూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గణిత మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు 35 రకాల బోధనోపకరణ కృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో బీర్కూర్‌లోని 10 పాఠశాలలకు చెందిన 675 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గణితంపై క్విజ్, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యకర్రమంలో ఎంఈవో వెంకన్న, ప్రధానోపాధ్యాయుడు శివరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కామారెడ్డి, జనవరి 4 : జిల్లా కేంద్రంలోని మంజీరా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎమ్మెసెస్ కంపెనీ, టాస్క్ ఆధ్వర్యంలో హెటిరో డ్రగ్స్ ఫార్మా కంపెనీ వారు శనివారం జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గురువేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసమే జాబ్‌మేళా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు జనార్దన్, సీతారాం, టాస్క్ ప్రతినిధులు తుకారాం, శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డైరెక్టర్ సురేశ్‌గౌడ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన

బీబీపేట్(దోమకొండ), జనవరి 4 : దోమకొండలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి, సర్వే చేసి యాప్‌లో వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తూ నిరసన తెలియజేస్తున్న సివిల్ సప్లయీ హమాలీలు

కామారెడ్డి/పెద్దకొడప్‌గల్/ఎల్లారెడ్డిరూరల్, జనవరి 4 : సివిల్ సప్లయీస్ హమాలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హమాలీలు, ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సివిల్ సప్లయీస్ హమాలీల సమస్యలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని కమాన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, ఉపాధ్యక్షుడు దశరథ్, హమాలీ కార్మికులు బీరయ్య, శ్రీనివాస్, సంపత్, గంగరాజు, భీమయ్య, కృష్ణ, బీరయ్య సాయిలు, శ్రీకాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పిట్లంలో కొనసాగుతున్న సమ్మెకు రేషన్ డీలర్లు మద్దతు తెలుపుతూ సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సివిల్ సప్లయీస్ హమాలీలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఎల్లారెడ్డి సివిల్ సప్లయీస్ యూనియన్ అధ్యక్షుడు సాయిలు, ఉపాధ్యక్షుడు కాశీరాం, కార్యదర్శి రవి, కోశాధికారి శ్రీకాంత్, సభ్యులు నరేశ్, రాములు, ప్రభాకర్, బాబు, అల్లు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో మున్సిపల్ కార్మికులు..

బాన్సువాడ టౌన్, జనవరి 4 : బాన్సువాడలోని బల్దియా కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు శనివారం సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు రవీందర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. వెంటనే ముఖ్యమంత్రి స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు బుజ్జిగారి సాయిలు, కార్యదర్శి రాజు, సహాయ కార్యదర్శి పిట్లం సాయిలు, ఆపరేటర్ వెంకట్, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, జనవరి 4 : దవాఖాన భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి సూచించారు. భవన నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. నిర్మాణ పనుల గురించి సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. దవాఖాన నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గంగాధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ రవీందర్ గుప్తా, నర్సింహాచారి, ఎజాస్, లింగమేశ్వర్, రఘురామయ్య తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకుడు

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు పష్పగుచ్ఛం అందజేస్తున్న సత్యంరావు

గాంధారి, జనవరి 4: బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను పార్టీ మండల నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు పష్పగుచ్ఛం అందజేసి మండలంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన

నిజాంసాగర్, జనవరి 4 : రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మాగి షుగర్ ఫ్యాక్టరీ వద్ద డ్రైవర్లకు నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు నియమాలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని, సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాహన డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్‌లో రెండో స్థానం

పెద్దకొడప్‌గల్, జనవరి 4 : హన్మకొండలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో మండలంలోని పోచారం గ్రామ యువకుడు పోలెల అనిల్ రెండో స్థానం సాధించాడని ఫిజికల్ డైరెక్టర్ దానప్ప శనివారం తెలిపారు. ఈ సదర్భంగా అనిల్‌ను గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ

నాగిరెడ్డిపేట, జనవరి 4: మండలంలోని పోచారం ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం ఎంఈవో భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వాస్‌రెడ్డి ఐడీ కార్డులను పంపిణీ చేశారు. పాఠశాలలో 2024 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయుడు ఉదయ్‌కిరణ్ తన తొలి వేతనంతో..విద్యార్థులకు ఐడీ కార్డులను తయారు చేయించి వితరణ చేసినట్లు చెప్పారు. ఉపాధ్యాయుడిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

లింగంపేట(తాడ్వాయి), జనవరి 4: తాడ్వాయి మండలం పల్లెగడ్డ తండాలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. సంస్థ సభ్యుడు సుజిత కృష్ణకర్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హేమలత, ఉపాధ్యాయులు సతీశ్,రమేశ్, సంగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

పనిచేసిన పాఠశాలకు బీరువా వితరణ

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 4: పనిచేసిన పాఠశాలకు శనివారం లైబ్రరీ బీరువాను ఇచ్చి పాఠశాలపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు ఓ ఉద్యోగి. లింగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో 1985లో పది నెలలు పనిచేసిన ఉపాధ్యాయుడు ముప్పవరం ఉమాకాంత్ ప్రస్తుతం కామారెడ్డిలో దేవునిపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్నారు. ఈ నెలలో ఉద్యోగ విరమణ పొంద ను న్న ఆయన రూ. 9వేల విలువైన బీరువాను శనివారం అందించారు.

సమయానికిరాని ఉపాధ్యాయులు.. పట్టించుకోని అధికారులు

బాలికల ఉన్నత పాఠశాలలో ప్రార్థన సమయానికి హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులు

లింగంపేట, జనవరి 4: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సమయ వేళలు పాటించడం లేదు. ఉదయం ప్రార్థన సమయానికి హాజరుకావాల్సి ఉండగా సమయానికి రావడం లేదు. మండల స్థాయి అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో విద్యార్థులూ ప్రార్థన సమయానికి రావడంలేదు. శనివారం ఉదయం లింగంపేట బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు హాజరుకాలేకపోయారు. ఉన్నత పాఠశాలలో 14 మంది ఉపాధ్యాయులకు గాను ఆరుగురు మాత్రమే ప్రార్థన సమయానికి వచ్చారు. 182 మంది విద్యార్థులకు గాను వంద మంది విద్యార్థులు సైతం హాజరుకాలేదు. ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులకుగాను శనివారం ప్రార్థన సమయంలో వంట మనిషితో పాటు ఒక ఉపాధ్యాయురాలు మాత్రమే హాజరయ్యారు. ఈ పాఠశాలలో సైతం 171 మంది విద్యార్థులకు గాను 70 మందే హాజరయ్యారు. స్థానిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు కామారెడ్డి పట్టణం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. అధికారులు పాఠశాలలు సందర్శించని కారణంగా ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సర్వశిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఆర్పీలు సమ్మెలో ఉండడంతో పాఠశాలలు సందర్శించే వారు కరువయ్యారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులు సమయ వేళలు పాటించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వేళలు పాటించని ఉపాధ్యాయులపై చర్యలు..

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు వేళలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం. ఉపాధ్యాయులు సమయవేళలు పాటించాలి. మండల విస్తీర్ణం పెద్దదిగా ఉన్నందున పాఠశాలల సందర్శనకు సమయం సరిపోవడం లేదు. నేను పాఠశాలలు తనిఖీ చేస్తున్నాను. ప్రత్యేకంగా ప్రధానోపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి సమయవేళలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తాం. బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల్లో ఇద్దరు డిప్యూటేషన్‌పై వెళ్లగా మరొకరు సెలవులో ఉన్నారు. ఆరుగురు ఉపాధ్యాయులు ప్రార్థనకు హాజరయ్యారు. ఇద్దరు పదోతరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల్లో ఉన్నారు.

– షాఖత్ అలీ, ఎంఈవో

రోస్టర్ పద్ధతిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీ

గాంధారి, జనవరి 4: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాల(ఈఎంఆర్ఎస్)లో ఖాళీగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను రోస్టర్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు ఈఎంఆర్ఎస్ రీజినల్ కో– ఆర్డినేటర్ గంగారాంనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల కోసం ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్‌లో కలెక్టర్ ఆదేశాలతో సల్ప మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. 1 క్యాటరింగ్ పోస్ట్ (ఓసీ జనరల్), మెస్ హెల్పర్ ఐదు పోస్టులకు గాను 1 (ఓసీ మహిళ), 1(ఎస్సీ మహిళ), (1 ఓసీ జనరల్), 1(బీసీ జనరల్), 1 (ఎస్సీ జనరల్), శానిటేషన్ 2 పోస్టులకు గాను 1(ఓసీ మహిళ), 1(ఎస్సీ మహిళ), ఎలక్ట్రీషియన్ 1(ఓసీ జనరల్), స్టాఫ్ నర్సు (ఒసీ జనరల్), చౌకీదార్ 2 పోస్టులు (ఓసీ జనరల్), గార్డెనర్ 1 (ఓసీ జనరల్) ఉన్నాయి. మొత్తం 13 ఉద్యోగాలను రోస్టర్ విధానంలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను కామారెడ్డి కలెక్టరేట్‌లో నోటీస్ బోర్డుపై అతికించినట్లు పేర్కొన్నారు.

చెరుకు ట్రాక్టర్‌కు మంటలు

లింగంపేట, జనవరి 4: మండలంలోని శెట్పల్లి, పర్మళ్ల గ్రామాల మధ్య శనివారం చెరుకు ట్రాక్టర్‌కు మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. శెట్పల్లిసంగారెడ్డి గ్రామం నుంచి సదాశివనగర్ మండలంలోని గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీకి చెరుకును వేసుకొని బయలుదేరిన ట్రాక్టర్‌కు పర్మళ్ల గ్రామ శివారు రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి చెరుకుకు మంటలు అంటుకున్నాయి. మంటలు రావడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేసినట్లు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

లింగంపేట, జనవరి 4: మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన పొట్టివారి రామస్వామి (28) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సుధాకర్ తెలిపిన ప్రకారం.. రామస్వామి కొంత కాలంగా నడుము నొప్పితో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా దవాఖానల్లో చూపించుకోలేదు. శుక్రవారం ఉదయం భార్య విజయ కూలీ పనులు వెళ్లగా, ఆమె సాయంత్రం తిరిగి వచ్చే సమయానికి జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకొన్నాడు. శనివారం ఉదయం మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. రామస్వామికి తల్లి, భార్య, కుమారుడు, కూతురు ఉన్నారన్నారు.

ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్

రామారెడ్డి, జనవరి 4 : మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో ఉమ్మడి మండల విద్యార్థులకు ప్రవేశ పరీక్ష కోసం జనవరి 6వ తేదీ నుంచి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ రాజిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు 6వ తరగతిలో ప్రవేశం కోసం ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న నిర్వహిస్తారన్నారు. అలాగే 7వ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

పాడి పరిశ్రమపై శిక్షణ

నిజాంసాగర్, జనవరి 4 : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో డీఆర్డీవో వామన్‌రావు ఆధ్వర్యంలో పాడి పరిశ్రమపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ పాడి పరిశ్రమపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద 100 రోజులు పూర్తి చేసుకున్న వారికి ఉన్నత శిక్షణలో భాగంగా పాడి పరిశ్రమపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ రామకృష్ణ, ఏపీవో శివకుమార్, ఏపీఎం రాంనారాయణ గౌడ్, టీఏ చందు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

పిట్లం గ్రంథాలయంలో నాయకులతో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

పెద్దకొడప్‌గల్, జనవరి 4 : పిట్లం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు హన్మాండ్లు, మోహన్‌రెడ్డి, రాంరెడ్డి, ఇమ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ గ్రంథాలయ భవన నిర్మాణ పనుల పరిశీలన..

పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. నిలిచిన గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రంథాలయంలో మౌలిక వసతులు లేవని, పోటీ పరీక్షల పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో లేవని గ్రంథాలయ చైర్మన్‌కు సమస్యలను గ్రామ నాయకులు వివరించారు. స్పందించిన చైర్మన్ వారం రోజుల్లో సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గ్రంథాలయం పరిశీలన..

నస్రుల్లాబాద్, జనవరి 4 : బీర్కూర్‌లో శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌ర